# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | మంగళవారం 12-4-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 210 | పేజీలు:4 | వెల: రూ.1/-


## సీతారాములను దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉంది: గవర్నర్ తమిళి సై



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఏప్రిల్ 11:: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతమని తెలంగాణ గవర్నర్ తమిళి సై అన్నారు. సోమవారం గవర్నర్ దంపతులు సీతారాముల స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తమిళి సై మాట్లాడుతూ భక్త రామదాసు నిర్మించిన ఆలయాన్ని, సీతారాములను దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కాగా గవర్నర్ దంపతులకు ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు.

# మోదీకి 24 గంటల డెడ్‌లైన్..

## తాడోపేడో తేల్చుకుంటాం : సీఎం కేసీఆర్

## జైలుకు పంపుతామని బెదిరిస్తున్నారు.. దమ్ముంటే రండి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: కేంద్రంపై పోరాటానికి తెలంగాణ ప్రజలు, రైతులు సిద్ధంగా ఉన్నారని, తాడోపేడో తేల్చుకుంటామని ముఖ్యమంత్రి కేసీఆర్ తేల్చిచెప్పారు. కేంద్రానికి 24 గంటల డెడ్‌లైన్ విధించారు కేసీఆర్. 24 గంటల్లోపు ధాన్యం సేకరణపై కేంద్రం ఓ నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలోని రైతులు భిక్షగాళ్ళు కాదు.. ఒకే విధానం లేకపోతే రైతులు రోడ్లపైకి వస్తారని కేసీఆర్ స్పష్టం చేశారు. మోదీ, పీయూష్ గోయల్‌కు రెండు చేతులు జోడించి విజ్ఞప్తి చేస్తున్నాను.. తెలంగాణ రైతులు పండించిన ధాన్యాన్ని కొనాలని కోరుతున్నానని కేసీఆర్ పేర్కొన్నారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్ వేదికగా టీఆర్ఎస్ పార్టీ చేపట్టిన రైతు నిరసన దీక్షలో సీఎం కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ నుంచి సుమారు 2 వేల కి.మీ. దూరం వచ్చి దీక్ష చేస్తున్నాం. ఇంత దూరం వచ్చి ఆందోళన చేయడానికి కారణమెవరు? నరేంద్ర మోదీ ఎవరితోనైనా పెట్టుకో.. కానీ రైతుల వద్ద మాత్రం పెట్టుకోవద్దు. ప్రభుత్వంలో ఎవరూ శాశ్వతంగా ఉండరు. కేంద్రం ధాన్యం కొనాలని ఢిల్లీలో దీక్ష చేస్తున్నాం. దీక్షకు మద్దతిచ్చేందుకు వచ్చిన రాకేశ్ తికాయత్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు కేసీఆర్. ఉద్యమాల పోరాట ఫలితంగా 2014లో తెలంగాణ వచ్చిందని కేసీఆర్ గుర్తు చేశారు. రాష్ట్రం వచ్చాక రైతుల కోసం అనేక సంస్కరణలు తెచ్చామని తెలిపారు. రైతులకు ఉచితంగా 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నాం. మిషన్ కాకతీయ ద్వారా చెరువులను పునరుద్ధరించాం. ప్రాజెక్టులను పూర్తి చేసుకున్నాం. సాగుకు సరిపడా నీటిని అందిస్తున్నామని చెప్పారు. తెలంగాణలో కోటి ఎకరాల భూమి సాగులోకి వచ్చిందన్నారు. ప్రధాని స్వరాష్ట్రం గుజరాత్‌లో విద్యుత్ కోసం రైతుల ఆందోళనలు కొనసాగుతున్నాయని కేసీఆర్ తెలిపారు.



### జైలుకు పంపుతామని బెదిరిస్తున్నారు.. దమ్ముంటే రండి : సీఎం కేసీఆర్

రాష్ట్ర బీజేపీ నేతలపై ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రిని జైలుకు పంపుతామని అంటున్నారు.. దమ్ముంటే రండి అని కేసీఆర్ సవాల్ విసిరారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్ వేదికగా టీఆర్ఎస్ పార్టీ చేపట్టిన రైతు నిరసన దీక్షలో సీఎం కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు.కేంద్రం కార్పొరేట్లకు కొమ్ము కాస్తూ.. రైతుల జీవితాలతో ఆటలాడుకుంటోందని కేసీఆర్ మండిపడ్డారు. కేంద్రానికి ఎదురు తిరిగితే సీబీఐ, ఈడీ వంటి సంస్థలతో దాడులు చేస్తారు. బీజేపీలో అందరూ సత్యహరిశ్చంద్రులే ఉన్నారా? వాళ్ల దగ్గరకు ఈడీ, సీబీఐ వెళ్లదు.. ప్రతి రాష్ట్రంలో ఇతర పార్టీల నాయకులను బెదిరిస్తున్నారు. సీఎంను జైలుకు పంపుతామని రాష్ట్ర బీజేపీ నేతలు అంటున్నారు. దమ్ముంటే రావాలని సవాల్ విసిరారు. ఊరికే మొరగడం సరికాదని కేసీఆర్ అన్నారు.

### రాష్ట్ర బీజేపీ నేతలకు సిగ్గుండాలి..

కేంద్రం పంట మార్పిడి చేయాలని సూచించినట్లు తాము రైతులకు చెప్పామని కేసీఆర్ గుర్తు చేశారు. కానీ ఉద్దేశపూర్వకంగా రైతులు ధాన్యం పండించండి.. మేము కొంటామని కిషన్ రెడ్డి చెప్పారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ కూడా రైతులను రెచ్చగొట్టాడు. రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేయాలని తాము ఢిల్లీలో ధర్నా చేస్తే.. పోటీగా బీజేపీ నేతలు హైదరాబాద్‌లో ధర్నా చేస్తున్నారు. అసలు వాళ్లకు సిగ్గుండాలని కేసీఆర్ విమర్శించారు. ఏ ఉద్దేశంతో బీజేపీ నేతలు హైదరాబాద్‌లో ధర్నా చేస్తున్నారని ప్రశ్నించారు. బీజేపీ నిస్సిగ్గుగా వ్యవహరిస్తోందన్నారు. అంతిమ విజయం సాధించేంత వరకు విశ్రమించేది లేదని కేసీఆర్ తేల్చిచెప్పారు.

## దీక్ష ప్రాంగణంలో సీఎం కేసీఆర్.. జ్యోతిబా పూలేకు నివాళులు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 11:రైతుల పక్షాన ప్రజాప్రతినిధుల నిరసన దీక్ష పేరుతో ఢిల్లీలోని తెలంగాణ భవన్ వేదికగా టీఆర్ఎస్ పార్టీ చేపట్టిన దీక్షకు ముఖ్యమంత్రి కేసీఆర్, రాకేశ్ తికాయత్ హాజరయ్యారు. సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన అమరవీరుల స్థూపానికి, మహాత్మా జ్యోతిబా పూలే, అంబేద్కర్ చిత్రపటాలకు కేసీఆర్ నివాళులర్పించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి కేసీఆర్ పుష్పాలు సమర్పించారు.

కేంద్రం యాసంగి ధాన్యం కొనాలనే డిమాండ్‌తో టీఆర్ఎస్ పార్టీ ఈ దీక్ష చేపట్టింది. ధాన్యం సేకరణలో ఒకే విధానం ఉండాలనే డిమాండ్‌తో ఈ దీక్ష చేస్తున్నారు. ఈ దీక్షలో మంత్రులు, టీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు నాయకులు పాల్గొన్నారు. వరి ధాన్యం కొనుగోళ్లపై కేంద్రానికి టీఆర్ఎస్ అల్టిమేటం ఇవ్వనుంది. దీక్ష వేదికగా టీఆర్ఎస్ తదుపరి కార్యాచరణను ప్రకటించే అవకాశం ఉంది. కేంద్రంపై పోరును మరింత తీవ్రం చేసే యోచనలో సీఎం కేసీఆర్ ఉన్నారు.

## తెలంగాణ ప్రభుత్వం ఢిల్లీలో పోరాడడం కేంద్రానికి సిగ్గుచేటు : రాకేశ్ తికాయత్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: రైతు వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్న కేంద్ర ప్రభుత్వంపై జాతీయ రైతు ఉద్యమ నాయకుడు రాకేశ్ తికాయత్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ధాన్యం సేకరణపై ఢిల్లీలోని తెలంగాణ భవన్ వేదికగా టీఆర్ఎస్ పార్టీ చేపట్టిన నిరసన దీక్షలో రాకేశ్ తికాయత్ పాల్గొని ప్రసంగించారు.

దేశంలో ఏం జరుగుతోందని తికాయత్ ఆగ్రహం వ్యక్తం చేశారు రైతులు మరణిస్తూనే ఉండాలా? అని ప్రశ్నించారు. దేశంలో రైతులు తమ హక్కుల కోసం పోరాడుతూనే ఉంటారు. ధాన్యం కొనాలంటూ తెలంగాణ ప్రభుత్వం ధర్నా చేస్తోంది. ఒక రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీలో పోరాడడం కేంద్రానికి సిగ్గుచేటు. ధాన్యం కొనుగోలుకు దేశ వ్యాప్తంగా ఒకే విధానం ఉండాలి. ఒకే విధానం లేకపోతే రైతులు రోడ్లపైకి రావాల్సి వస్తుంది. సాగుచట్టాల రద్దు కోసం ఢిల్లీలో 13 నెలల పాటు ఉద్యమించాం. కేంద్రం ఏడాదికి 3 విడతలుగా రైతులకు రూ. 6 వేలు ఇస్తోంది. ఏడాదికి రూ. 6 వేలు ఇస్తూ రైతులను ఉద్ధరిస్తున్నట్లు కేంద్రం మాట్లాడుతోంది అని ఎద్దేవా చేశారు.

తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు మద్దతుగా ఈ ఆందోళన చేస్తున్నారు. కేసీఆర్ చేస్తున్నది రాజకీయ ఉద్యమం కాదు అని తికాయత్ స్పష్టం చేశారు. రైతుల కోసం మమతా బెనర్జీ కూడా ఆందోళన చేస్తున్నారు. రైతుల పక్షాన కేసీఆర్ చేస్తున్న ఈ ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నాను. రైతుల కోసం పోరాటం ఎవరు చేసినా వారికి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. రైతుల కోసం సీఎం కేసీఆర్ చేస్తున్న పోరాటం అభినందనీయమని తికాయత్ ప్రశంసలు కురిపించారు.

## మహాత్మ జ్యోతిబా పులేకు జయంతి సందర్భంగా శ్రద్ధాంజలి ఘటించిన ప్రధానమంత్రి



File Photo

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11:గొప్ప సామాజిక సంస్కరణ వాది, దార్శనికుడు మరియు రచయిత అయిన మహాత్మ జ్యోతిబా ఫులే కు ఆయన జయంతి నాడు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ శ్రద్ధాంజలి ని సమర్పించారు. సామాజిక న్యాయం యొక్క గట్టి సమర్థకుడు గాను, అశేష ప్రజానీకాని కి ఆశాకిరణం గాను మహాత్మ ఫులే కు విస్తృతమైన ఆదరణ ఉంది; ఆయన సామాజిక సమానత్వం, మహిళ ల సశక్తీకరణ మరియు విద్య కు ప్రోత్సాహాన్ని ఇవ్వడం కోసం అలుపెరుగక కృషి చేశారు అని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు.

ప్రధాన మంత్రి తన 'మన్ కీ బాత్' ('మనసు లో మాట') కార్యక్రమం లో గొప్ప ఆలోచన పరుడు అయిన జ్యోతిబా ఫులే గారి ని గురించి తన భావాల ను వెల్లడి చేశారు. ఆ కార్యక్రమం లో మహాత్మ ఫులే బాలిక ల కోసం పాఠశాలల ను ప్రారంభించారని, అంతే కాక ఆడశిశు హత్యల కు వ్యతిరేకం గా గళమెత్తారని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. నీటి ఎద్దడి పరిష్కారం అయ్యేందుకు ఉ ద్యమాల ను కూడా ఆయన నడిపారు అని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు.

"సామాజిక న్యాయం యొక్క గట్టి సమర్థకుడు గాను, అశేష ప్రజానీకాని కి ఆశాకిరణం గాను మహాత్మ ఫులే కు విస్తృతమైన ఆదరణ ఉంది; ఆయన యొక్క బహుపార్శ్వయుక్త వ్యక్తిత్వం మరియు ఆయన సామాజిక సమానత్వం, మహిళల సశక్తీకరణ, ఇంకా విద్య కు ప్రోత్సాహాన్ని ఇవ్వడం కోసం అలుపెరుగక కృషి చేశారు. ఆయన జయంతి నాడు ఆయన కు ఇదే శ్రద్ధాంజలి."

"ఈ రోజు న మహాత్మ ఫులే జయంతి; మరి కొన్ని రోజుల లోనే అంటే ఈ నెల 14వ తేదీ నాడు మనం అంబేడ్ కర్ జయంతి ని జరుపుకోనున్నాం. కిందటి నెల చటజీనిఐతిఃజీజీబి ('మనసు లో మాట') కార్యక్రమం లో ఇరువురికి శ్రద్ధాంజలి ని సమర్పించాను. మహాత్మ ఫులే మరియు డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్ కర్ లకు వారి మహత్తరమైనటువంటి తోడ్పాటు కు గాను భారతదేశం ఎప్పటికీ కృతజ్ఞతల ను తెలియజేసుకొంటూ ఉంటుంది." అని పేర్కొన్నారు.

## కీవ్‌ను కూడా స్వాధీనం చేసుకుంటాం.. తేల్చిచెప్పిన చెచెన్యా అధ్యక్షుడు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11:ఉక్రెయిన్‌పై రష్యా సేనల దాడుల నేపథ్యంలో రిపబ్లిక్ ఆఫ్ చెచెన్యా దేశాధ్యక్షుడు రంజాన్ కడీరోవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన టెలిగ్రాం ఛానెల్‌లో షేర్ చేసిన ఈ వీడియోలో.. "మరియాపోల్ మాత్రమే కాదు, కీవ్‌పై కూడా దాడి చేస్తాం. ముందుగా లుహాన్స్, డోనెట్స్ ప్రాంతాలకు విముక్తి కలిగిస్తాం. ఆ త్వాత కీవ్, ఇతర నగరాలను కూడా స్వాధీనం చేసుకుంటాం" అని స్పష్టంగా చెప్పేశారు.

తనను తాను రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సైనికుడిగా చెప్పుకునే రంజాన్.. కీవ్ విషయంలో ఎటువంటి అనుమానాలూ అక్కర్లేదని ధీమా వ్యక్తం చేశారు. ఒక్క అడుగు కూడా వెనక్కు తీసుకోవడం జరగదని, ఈ విషయంలో తాను హామీ ఇస్తున్నానని అన్నారు.

మానవ హక్కులను కాలరాశారంటూ రంజాన్ కడీరోవ్‌పై అమెరికా సహా యూరోపియన్ దేశాలు ఆరోపణలు చేస్తూ వస్తున్నాయి. అయితే అవన్నీ తప్పుడు ఆరోపణలంటూ ఆయన కొట్టిపారేస్తున్నారు. ప్రత్యేక ఆపరేషన్ పేరుతో ఉక్రెయిన్‌పై రష్యా దళాలు దాడులు చేస్తున్న సంగతి తెలిసిందే.

## మహాత్మా జ్యోతిబా పూలేకు నివాళులర్పించిన మంత్రి కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 11: గొప్ప సంఘ సంస్కర్త, ఆలోచనాపరుడు మహాత్మా జ్యోతిబా పూలేకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ నివాళులర్పిస్తూ ట్వీట్ చేశారు. మహిళా విద్యకు మార్గదర్శకుడు జ్యోతిబా పూలే అని కేటీఆర్ కొనియాడారు.

మహాత్మా జ్యోతిబాపూలే జయంతి వేడుకలను నేడు రవీంద్ర భారతిలో నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమశాఖ కమిషనర్ పేర్కొన్నారు. అణగారిన వర్గాల ఆశాజ్యోతి, వెనుకబడిన వర్గాల జీవితాల్లో సమూల మార్పుల కోసం జీవితాన్ని ధారపోసిన జ్యోతిబాపూలే 196 జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందన్నారు.

## మూడేళ్ల గరిష్ఠానికి చేరిన ఇంధన డిమాండ్..!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11:కరోనా మహమ్మారి తర్వాత దేశంలో ఇంధన డిమాండ్ భారీగా పెరిగింది. ఈ ఏడాది మార్చిలో డిమాండ్ మూడేళ్ల గరిష్ఠానికి చేరింది. 4.2శాతం పెరగడంతో మార్చిలో పెట్రోలియం ఉత్పత్తి వినియోగం 19.41 మిలియన్ టన్నులుగా నమోదైంది. ఈ వివరాలను చమురు మంత్రిత్వ శాఖ పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలిసిస్ సెల్ డేటా తెలిపింది. కొవిడ్ మహమ్మారి ప్రభావం నుంచి ఆర్థిక వ్యవస్థ పుంజుకోవడంతో మార్చిలో రవాణా ఇంధనానికి డిమాండ్ పెరిగింది. దేశంలో అత్యధికంగా ఉపయోగించే ఇంధనం డీజిల్. కాగా, మొత్తం పెట్రోలియం ఉత్పత్తుల్లో దాదాపు 40శాతం వాటా ఉన్నది.

డిమాండ్ 6.7శాతం పెరిగి 7.7 మిలియన్ టన్నులకు చేరింది. వ్యవసాయరంగం నుంచి డిమాండ్‌తో పాటు ధరల పెరుగుదల వార్తల మధ్య నిల్వ చేయడంతో డీజిల్ వినియోగం ఎక్కువగా ఉన్నది. వంట గ్యాస్ (ఎల్‌పీజీ) డిమాండ్ మార్చిలో 9.8శాతం పెరిగి 2.48 మిలియన్ టన్నులకు చేరింది. మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ఇంధన డిమాండ్ 4.3శాతం పెరిగి 202.71 మిలియన్ టన్నులకు చేరింది. ఇది 2020 ఆర్థిక సంవత్సరం తర్వాత ఇదే అత్యధికం. ఆటో, వంట ఇంధన వినియోగం పెరిగినప్పటికీ పారిశ్రామిక రంగంలో ఇంధన వృద్ధి తగ్గింది. 2021-22లో పెట్రోలు వినియోగం 10.3 శాతం పెరిగి 30.85 మిలియన్ టన్నులు కాగా, డీజిల్ అమ్మకాలు 5.4 శాతం పెరిగి 76.7 మిలియన్ టన్నులకు చేరుకున్నాయి. 2019-20లో 82.6 మిలియన్ టన్నుల వినియోగం తర్వాత డీజిల్ అమ్మకాలు అత్యధికంగా ఉండగా, ఆర్థిక సంవత్సరం-22లో పెట్రోల్‌కు డిమాండ్ ఎప్పుడూ లేనంతగా ఉంది.

ఎల్‌పీజీ వినియోగం 3 శాతం పెరిగి 28.33 మిలియన్ టన్నులకు చేరుకుంది. విమానాల ఇధనం (ఏటీఎఫ్) డిమాండ్ ఐదు మిలియన్ టన్నులకు పెరిగింది. కరోనా పరిస్థితుల తర్వాత ఇటీవల పూర్తిస్థాయిలో విమానయాన సేవలు ప్రారంభించడమే ఇందుకు ప్రధాన కారణం. పెట్రోలియం కోక్ వినియోగం 9.7 శాతం తగ్గి 14.1 మిలియన్ టన్నులకు చేరుకోగా, 2022 ఆర్థిక సంవత్సరంలో కిరోసిన్ డిమాండ్ 17 శాతం తగ్గి 1.5 మిలియన్ టన్నులకు చేరుకుంది. పరిశ్రమలలో ఇంధనంగా ఉపయోగించే నాఫ్తా, అలాగే రోడ్డు నిర్మాణంలో ఉపయోగించే బిటుమెన్ వినియోగం స్వల్పంగా పెరిగి వరుసగా 14.2 మిలియన్ టన్నులు, 7.7 మిలియన్ టన్నులకు పెరిగింది.

## ఇమ్రాన్ ఖాన్ స్థానంలో పాక్ ప్రధానిగా షెహబాజ్ షరీఫ్

ఇస్లామాబాద్, ఏప్రిల్ 11: పొరుగుదేశం పాకిస్థాన్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరనున్నది. పాక్ కొత్త ప్రధానిగా షెహబాజ్ షరీఫ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాక్ జాతీయ అసెంబ్లీలో సోమవారం జరిగిన ప్రధాని ఎన్నిక కార్యక్రమం జరగ్గా.. ఇమ్రాన్‌ఖాన్ నేతృత్వంలోని పాకిస్థాన్ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ పార్టీ వాకౌట్ చేయడంతో.. షరీఫ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇంతకు ముందు ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌పై శనివారం అర్ధరాత్రి జాతీయ అసెంబ్లీలో ప్రతిపక్ష పార్టీలు ప్రవేశపెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో పదవీచ్యుతుడయ్యాడు. ఆ తర్వాత కొత్త ప్రధాని ఎన్నిక అనివార్యమైంది.

ప్రతిపక్షాలు తమ ప్రధాని అభ్యర్థిగా షెహబాజ్ షరీఫ్‌ను ప్రధాని అభ్యర్థిగా ప్రకటించగా.. నామినేషన్ దాఖలు చేశారు. అయితే, ఇంతకు ముందు ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలోని పీటీఐ పార్టీ ప్రధాన అభ్యర్థిగా మాజీ విదేశాంగ మంత్రి మొహ్మద్ ఖురేషీని ప్రధాన మంత్రి అభ్యర్థిగా ప్రకటించింది. ప్రధానిగా ఎన్నికైన షహబాజ్ ఇవాళ రాత్రి 8 గంటలకు ప్రమాణస్వీకారం చేయనున్నారు. షరీఫ్ ప్రస్తుతం ఆయన పాకిస్థాన్ ముస్లిం లీగ్ (ఎన్) పార్టీ అధ్యక్షుడిగా పని చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ తొలగింపునకు వ్యతిరేకంగా లాహోర్‌లోని లిబర్టీ చౌక్‌లో పెద్ద సంఖ్యలో పీటీఐ మద్దతుదారులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఫైసలాబాద్, ముల్తాన్, గుజ్రాన్‌వాలా, వెహారి, జెహ్లం, పంజాబ్ ప్రావిన్స్‌లోని నిరసనలు కొనసాగాయి.


Ministry of Culture
Government of India

Azadi Ka Amrit Mahotsav

సాహిత్య అకాదెమి
మరియు
కళల కాణాచి, తెనాలి
సంయుక్తంగా నిర్వహిస్తున్న
తెలుగు నాటకం - సాహిత్యం
(తెలుగు నాటకరంగ దినోత్సవం సందర్భంగా)
ఒకరోజు సదస్సుకు సాహితీప్రియులందరికీ ఆహ్వానం
శనివారం, 16 ఏప్రిల్ 2022
వేదిక : తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రం, తెనాలి



కార్యక్రమం

ప్రారంభ సమావేశం : ఉదయం 10 గంటలకు

స్వాగతం : ఎస్.పి. మహాలింగేశ్వర్, ప్రాంతీయ కార్యదర్శి, సాహిత్య అకాదెమి
అధ్యక్షులు : కె. శివారెడ్డి, సంచాలకులు, తెలుగు సలహా మండలి, సాహిత్య అకాదెమి
ముఖ్య అతిథి : ఎల్.బి. శ్రీరామ్, సినీ, నాటకరంగ నటులు; రచయిత
పరిచయం : సాయిమాధవ్ బుర్రా, సినీ రచయిత, వ్యవస్థాపక అధ్యక్షులు, కళల కాణాచి
కీలకోపన్యాసం : అప్పాజోస్యుల సత్యనారాయణ, అజో-విభో ఫౌండేషన్

తేనీటి విరామం

మొదటి సమావేశం : మధ్యాహ్నం 12.00-1.30

అధ్యక్షులు : వాసిరెడ్డి నవీన్
పత్ర సమర్పణ : కె.పి. అశోక్‌కుమార్ / తెలుగు నాటకరంగం - సామాజిక ఉద్యమాలు
కందిమళ్ల సాంబశివరావు / తెలుగు కథ - నాటకరంగం
బిహెచ్. పద్మప్రియ / తెలుగు నవల - నాటకరంగం

భోజన విరామం

రెండవ సమావేశం : మధ్యాహ్నం 2.15-4.00

అధ్యక్షులు : వి.ఆర్. రాసాని
పత్ర సమర్పణ : వాడ్రేవు సుందర్రావు / తెలుగు నాటకరంగం - సామాజిక ప్రాసంగికత
వల్లూరు శివప్రసాద్ / తెలుగు నాటక రచనాశిల్పం
దీర్ఘాశి విజయభాస్కర్ / తెలుగు నాటకం - ప్రయోగాలు
రాజీవ్ వెలిచేటి / తెలుగు నాటకం - ఇతర భాషల సాహిత్య ప్రభావం

తేనీటి విరామం

ముగింపు సమావేశం : సాయంత్రం 4.15-5.00

అధ్యక్షులు : చెరుకుమల్లి సింగ, ఉపాధ్యక్షులు, కళల కాణాచి
ముఖ్య అతిథి : గంగోత్రి సాయి, నాటక ప్రయోక్త, నటులు

RSVP: 080-22245152/22130870
website: www.sahitya-akademi.gov.in


## టీసీఎస్ కొత్త మైలురాయి...

బెంగళూరు, ఏప్రిల్ 11 : ఐటీ మేజర్ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) 2021-22 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసిక ఫలితాలను ఈరోజు(సోమవారం) ప్రకటించింది. కంపెనీ కొత్త మైలురాయిని తాకినట్లు ఈ ఫలితాలు చెబుతున్నాయి. ఆదాయం మొదటిసారిగా రూ. 50 వేల కోట్లను అధిగమించడం ఈ సందర్భంగా గమనార్హం. కాగా... లాభం కూడా... రూ. 10 వేల కోట్ల మార్కుకు చేరువ కావడం విశేషం. ఈ త్రైమాసికంలో సంస్థ ఏకీకృత నికర లాభం రూ. 9,926 కోట్లుగా నివేదించింది.

## ఈనెల 12న తెలంగాణ కేబినెట్ సమావేశం

హైదరాబాద్: తెలంగాణ కేబినెట్ సమావేశం ఈ నెల 12వ తేదీ మంగళవారం జరనుంది. ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు అధ్యక్షతన జరిగే సమావేశంలో పలు కీలక అంశాలను చర్చించనున్నారు. ప్రగతి భవన్ లో మధ్యాహ్నం 2గంటలకు జరిగే సమావేశానికి మంత్రులతో పాటు చీఫ్ సెక్రకటరీ పాల్గొననున్నారు. ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాలు, కీలకమైన అంశాలపై సమావేశంలో చర్చించి కేబినెట్ ఆమోదం తెలుపనుంది.


జూమ్ సమావేశంకు ఆహ్వానం

డా॥ నలిమెల భాస్కర్ కవిత్వం
'జీవద్రవ్యం'
ఆవిష్కరణోత్సవం




ZOOM ID : 3639004353
No need Password
సాహితీ సోపతి యూట్యూబ్ ఛానల్‌లో లైవ్ ప్రసారం

తేది : 13, ఏప్రిల్ 2022 బుధవారం
సాయంత్రం 7 గంటలకు

సభాధ్యక్షులు : అన్నవరం దేవేందర్
ముఖ్య అతిథి & ఆవిష్కర్త : నగునూరి శేఖర్
పుస్తక పరిచయం : బూర్ల వేంకటేశ్వర్లు
ఆత్మీయ అతిథులు : గాజోజు నాగభూషణం
: కందుకూరి అంజయ్య
: వేముల సత్యనారాయణ
: కూకట్ల తిరుపతి
ఆహ్వాన ప్రసంగం : సి.వి.కుమార్
ముగింపు : పెనుగొండ బసవేశ్వర్

సాహితీ సోపతి, కరీంనగర్.


### చరిత్రలో నేటినిజం



కం॥ అంచరి సంక్షేమమునకు
ముందు నిలచి సతతము రణమును సాగింపన్
"సుందర సింగ్యం డారి"కి
వందనములు నర్పించుచుంటి వందన్వందనముచున్॥



(ఏప్రిల్ 12 సుందర్‌సింగ్ భండారీ జననం...)

–రాధశ్రీ
సెల్: 9494481210

# ప్రమాణస్వీకారంలో ఆసక్తికర సన్నివేశం..

## సీఎం జగన్ కాళ్లు మొక్కిన మంత్రులు



అమరావతి, ఏప్రిల్ 11:ఏపీ మంత్రివర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పలు ఆసక్తికర సన్నివేశాలు చోటుచేసుకున్నాయి. ప్రమాణస్వీకారం చేసిన అనంతరం పలువురు మంత్రులు సీఎం జగన్ వద్ద తమ విధేయతను చాటుకున్నారు. కొందరు సీఎం, గవర్నర్ బిశ్వభూషణ్‌కు నమస్కరించి వెళ్లిపోగా.. మరికొందరు మాత్రం జగన్ కాళ్లు మొక్కారు. ప్రమాణస్వీకారం అనంతరం మంత్రి నారాయణస్వామి సీఎం జగన్ కాళ్లు తాకి నమస్కరించగా.. మంత్రి రోజా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత సీఎం వద్దకు వెళ్లి ఆయన కాళ్లకు నమస్కరించిన అనంతరం ఆయన చేతిని ముద్దాడి కృతజ్ఞతలు తెలుపుకొన్నారు. కొత్తగా మంత్రి అయిన అమర్నాథ్ రెడ్డి, సిదిరి అప్పలరాజు తదితరులు సైతం జగన్ కాళ్లు మొక్కారు.

# రాష్ట్రం కోసం జగన్ గ్యారేజీలో పనిచేస్తా: కొడాలి నాని

అమరావతి, ఏప్రిల్ 11:పార్టీ, రాష్ట్రం కోసం జగన్ గ్యారేజీలో పనిచేస్తామని తాజా మాజీ మంత్రి కొడాలి నాని అన్నారు. ఏపీలో కొత్త కేబినెట్ ఏర్పడిన అనంతరం ఆయన మాట్లాడారు. తాము ఎప్పుడు పదవుల కోసం పాకులాడలేదని తెలిపారు. మంత్రి పదవులు రాకపోవడంతో అనుచరుల్లో కొంత అసంతృప్తి ఉన్నప్పటికీ త్వరలోనే సర్దుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. తొలి క్యాబినేట్‌లో తమకు చోటు కల్పించడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. జగన్ వెంట సైనికుల్లా పనిచేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర, పార్టీ భవిష్యత్ కోసం తీసుకునే నిర్ణయాలకు కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. పార్టీలో చేరినప్పటి నుంచి తమను అన్ని విధాల సముచిత గౌరవం ఇచ్చారని కొడాలి నాని గుర్తు చేశారు.

# బీసీలకు చేసిన మేలుపై శ్వేతపత్రం విడుదల చేయాలి: అచ్చెన్నాయుడు

అమరావతి, ఏప్రిల్ 11: ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ ప్రభుత్వం అన్ని విధాల అన్యాయం చేస్తున్నారని టీడీపీ ఏపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆరోపించారు. గడిచిన మూడేండ్లలో బీసీలకు ఏం చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన బీసీ నేతలతో సమావేశమయ్యారు. వైసీపీ మేనిఫెస్టోలో బీసీలకు అమలు కాని హామీలు, బీసీలపై దాడుల వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. బీసీలకు ఎన్నో పథకాలు తీసుకొచ్చింది టీడీపీ హయాంలోనేనని పేర్కొన్నారు. బలహీనవర్గాలను జగన్ ఉక్కుపాదంతో అణచివేస్తున్నారని ఆరోపించారు.

బలహీనవర్గాల నిధులను దారిమళ్లించిన ఘనత వైసీపీదేనని తెలిపారు. పైసా నిధులు కేటాయించకుండా బీసీ ఫెడరేషన్లు పెట్టారని విమర్శించారు. కొల్లు రవీంద్ర మాట్లాడుతూ బీసీలకు జరిగిన అన్యాయంపై చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. బీసీలను జగన్ అన్ని విధాలా వంచించారని అన్నారు. బీసీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారని విమర్శించారు.

సీనియర్ నాయకుడు యనమల మాట్లాడుతూ బీసీలకు కేటాయించిన నిధులు ఎక్కడికి పోతున్నాయో జగన్ చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీల ఆలోచనలకు తగినవిధంగా పని చేసే నాయకత్వం అవసరమని పేర్కొన్నారు. బీసీలకు ప్రత్యేక పథకాలుండాలని డిమాండ్ చేశారు. బీసీలకు నాలుగు మంత్రి పదవులు ఇస్తే వారినేదో ఆదుకున్నట్లు కాదని స్పష్టం చేశారు.

# అప్పన్న విగ్రహాన్ని దర్శించుకున్న కేజీఎఫ్ హీరో



అమరావతి, ఏప్రిల్ 11:విశాఖ విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన అప్పన్న విగ్రహాన్ని ప్రముఖ హీరో యాష్ దర్శించుకున్నారు. కేజీఎఫ్ సినిమా ప్రమోషన్ లో భాగంగా వైజాగ్ వచ్చిన యాష్ ఎయిర్ పోర్ట్ లో అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈవో సూర్యకళ, ట్రస్టు బోర్డు సభ్యులు స్వామి క్షేత్రమహిత్యాన్ని తెలియజేశారు. ఆయా కార్యాక్రమంలో స్థానాచారులు టీపీ రాజ్‌గోపాల్, పురోహితులు కరి సీతారామాచార్యులు, ఏఈవో రమణమూర్తి, విగ్రహశిల్పి రమణ, ఆలయ ఈఈ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎక్స్‌ఈ వేరియంట్‌కు భయపడొద్దు : ఎన్టీఏజీఐ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11:ఎక్స్‌ఈ వేరియంట్ కు భయపడొద్దని నేషనల్ టెక్నికల్ అడ్వైజరీ గ్రూప్ ఆన్ ఇమ్యూనైజేషన్ (ఎన్టీఏజీఐ) చీఫ్ ఎన్కే అరోరా అన్నారు. ఆయన మాట్లాడుతూ.. కరోనా వైరస్ వ్యాప్తి తగ్గుతున్న వేళ.. కొన్ని రాష్ట్రాల్లో కొత్త వేరియంట్ కేసులు బయపడుతున్నాయని, ముఖ్యంగా వేగంగా వ్యాప్తి చెందుతని భావిస్తోన్న ఎక్స్‌ఈ వేరియంట్ కేసులు గుజరాత్, మహారాష్ట్రలో వెలుగు చూడటం ఆందోళన రేపుతోందన్నారు. ఈ నేపథ్యంలో నూతన వేరియంట్ కేసులపై కొవిడ్ వర్కింగ్ గ్రూప్ స్పందించింది. భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. కొత్త వేరియంట్ తీవ్ర వ్యాధికి కారణమవుతుందని చెప్పడానికి ప్రస్తుతం ఎలాంటి ఆధారాలు లేవని పేర్కొంది. ఇటువంటి వేరియంట్లు వస్తూనే ఉంటాయని.. భయపడొద్దన్నారు. అయితే, ఎక్స్‌ఈ వేరియంట్ వ్యాప్తి, తీవ్రతపై స్పష్టమైన ఆధారాలు లేనప్పటికీ ప్రాథమిక ఆధారాల ప్రకారం ఈ వేరియంట్ అధిక సాంక్రమిక శక్తి కలిగి ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్వో) వెల్లడించింది.

# సరిహద్దులో పర్యాటక ఆకర్షణ -సీమా దర్శన్- ప్రారంభం!



న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: దేశ రక్షణలో సరిహద్దు భద్రతా దళం వీరోచిత కార్యకలాపాలను, ధైర్యసాహసాలను ప్రజలకు సవివరంగా తెలియజెప్పే లక్ష్యంతో -సరిహద్దు దర్శనం (సీమా దర్శన్)- పేరిట చేపట్టిన ప్రాజెక్టులో భాగంగా గుజరాత్ మారుమూలన బనస్కాంతా జిల్లాలోని నడాబెట్ ఔట్ పోస్టు వద్ద కొత్తగా నిర్మించిన పర్యాటక వసతి సదుపాయాలను కేంద్ర హోమ్, సహకార శాఖ మంత్రి అమిత్ షా ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా నడాబెట్ ఔట్ పోస్ట్ వద్ద జరిగిన సైనిక సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. అక్కడి సైనిక జవాన్లతో ముచ్చటించారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, సరిహద్దు భద్రతా దళం (బి.ఎస్.ఎఫ్.) డైరెక్టర్ జనరల్ ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ, సరిహద్దు భద్రతా దళంతో పాటుగా సరిహద్దు రక్షణకోసం పనిచేసే ఏ సంస్థకైనా కఠోర వాతావరణ పరిస్థితుల మధ్య జటిలమైన విధులను నిర్వర్తించవలసి ఉంటుందని అన్నారు. 6,385కిలోమీటర్ల నిడివితో ఉన్న దేశ సరిహద్దును బి.ఎస్.ఎఫ్. సిబ్బంది నిర్విరామంగా కాపాడుతూ వస్తున్నారని అన్నారు. ఇసుక తుపాన్లు, మండుటెండలు, అతి శీతల వాతావరణం మధ్య వారు జీవితాంతం సరిహద్దు భద్రతా విధుల్లో ఉంటున్నారని అన్నారు. నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటినుంచి దేశాన్ని ప్రతి రంగంలోనూ ప్రపంచంలోనే అత్యున్నత స్థాయికి చేర్చేందుకు ఒక క్రమ పద్ధతిలో కృషి జరుగుతూ వస్తోందని అన్నారు. సరిహద్దు భద్రతా దళం సిబ్బంది ఎంతో బాధ్యతాయుతంగా దేశ సరిహద్దులను సంరక్షిస్తున్నందున ఈ ప్రయత్నాలన్నీ ఫలించి ఆశించిన అభివృద్ధిని కూడా సాధించవచ్చని అన్నారు. బి.ఎస్.ఎఫ్., సాయుధ బలగాలు అద్భుతమైన ధైర్య సాహసాలు ప్రదర్శించిన సరిహద్దు ఇదేనని అన్నారు. యుద్ధంలో సరిహద్దు భద్రతా దళం వెయ్యి చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని పాకిస్తాన్.నుంచి చేజిక్కించుకుని ఘన విజయాన్ని సొంతం చేసుకుందని అన్నారు. చాలా కాలంగా అంటే ఒక ఒప్పందం కుదిరే వరకూ పరిపాలనా, నిర్వహణా కార్యకలాపాల్లో బి.ఎస్.ఎఫ్. పాలు పంచుకుంటూ వచ్చిందని అన్నారు. 1965లో 25 బెటాలియన్లతో మొదలైన బి.ఎస్.ఎఫ్. ఈ రోజు 193 బెటాలియన్లతో 2,65,000 మంది స్థాయికి చేరుకుందని, ఇంత భారీ స్థాయి బలగాలు మన దేశ భద్రతకు, సరిహద్దుల రక్షణకు పూచీగా నిలుస్తున్నాయని ఆయన అన్నారు.

కాశ్మీర్ లోయ ప్రాతంలో చొరబాటును భగ్నం చేయాల్సి ఉందని, ఈశాన్యంలో వామపక్ష తీవ్రవాద ప్రాబల్యం ఉన్న చోట్ల అంతర్గత భద్రతను రక్షించాల్సిన అవసరం కూడా ఉందని అన్నారు. మరో వైపు భారత్-బంగ్లాదేశ్ అంతర్జాతీయ సరిహద్దు ప్రాంతంలో ఉభయదేశాల మధ్య సామరస్య సంబంధాలు కొనసాగేలా చూడాల్సిన ఆవశ్యకత కూడా ఉందన్నారు. మోకాలి లోతు చిత్తడి నేలలు, ఇరుకైన లోయలు వంటి దుర్గమ ప్రాంతాల్లో కఠోర వాతావరణ పరిస్థితులలో కూడా దేశ భద్రతను కాపాడుకోవాలని, ఎందుకంటే అక్కడ బి.ఎస్.ఎఫ్. మినహా మరో సరిహద్దు భద్రతా బలగాలేవీ ఉండవని అమిత్ షా అన్నారు.

నడాబెట్ ప్రాంతంలో సీమాదర్శన్ కార్యక్రమం కోసం గుజరాత్ ప్రభుత్వం రూ. 125కోట్లు ఖర్చు చేసిందని అమిత్ షా అన్నారు. మన సరిహద్దులను కాపుకాసే బలగాలపట్ల చిన్నారులంతా గౌరవ భావం అలవరుచుకోవాలని అన్నారు. బి.ఎస్.ఎఫ్. సిబ్బంది ధైర్య సాహసాల ప్రదర్శనను, వారు సాధించి విజయాలను గురించి ఇక్కడ తెలుసుకున్నతర్వాత, దేశ రక్షణకు తామూ సేలవదించేందుకు వారు నిర్ణయం తీసుకోవాలని అన్నారు. ఐదవ తరగతినుంచి 8వ తరగతి వరకూ చదువుకొనే ప్రతి విద్యార్థికీ నడాబెట్ సరిహద్దు స్థావరమే పర్యాటక గమ్యంగా మారేలా చర్యలు తీసుకోవాలని గుజరాత్ ప్రభుత్వం సంకల్పించినట్టు చెప్పారు. దీనితో బి.ఎస్.ఎఫ్. త్యాగశీలత, అంకిత భావం, ధైర్య సాహసాలు గురించి పౌరసమాజానికి తెలుస్తుందని, చిన్నారులంతా పెరిగి పెద్దవారైన తర్వాత ఈ గౌరవభావాన్ని వారు జీవితాంతం గుర్తుపెట్టుకోగలుగుతారని అన్నారు. ఈ సరిహద్దు ఔట్ పోస్టు పరిసరాల్లో సందర్శకులు బస చేయడానికి వీలుగా తగిన వసతులను కల్పించడానికి గుజరాత్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అన్నారు. గుజరాత్ రాష్ట్రంలోని ప్రతి వ్యక్తీ కనీసం 2రోజులైనా బనస్కాంట శివార్లలో బస చేయాలని, సరిహద్దులో ఎదురయ్యే కష్టాల గురించి, సరిహద్దు ప్రాంతాల గురించి అప్పుడే వారికి అవగాహన ఏర్పడుతుందని ఆయన చెప్పారు.

తొలుత, నడాబెట్ ప్రాంతంలో సీమా దర్శన్ పేరిట కొత్తగా నిర్మించిన పర్యాటక వసతి సదుపాయాలను ప్రారంభించిన అనంతరం అమిత్ షా మాట్లాడుతూ, దేశ ప్రజలకు శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు. చైత్య నవరాత్రి ముగిసిన సందర్భంగా రామ నవమి పర్వదినం జరుపుకుంటామని, పౌరాణిక పురుషుడైన శ్రీరాముడి జన్మదినం కూడా ఇదేనని, కోట్లాది మంది శ్రీరామ నవమిని తమ ఇళ్లవద్ద జరుపుకుంటారని అన్నారు. ఆదర్శ పురుషుడు, మర్యాదా పురుషోత్తముడైన శ్రీరాముడు,.. జీవితంలో నిర్వహించాల్సిన ప్రతి పాత్రకూ ఆదర్శప్రాయుడుగా నిలిచాడని అన్నారు. ఆదర్శ కుమారుడుగా, భర్తగా, రాజుగా, చివరకు ఆదర్శ సైన్యాధిపతిగా ప్రతి పాత్రనూ ఆదర్శవంతంగా నిర్వహించిన భగవాన్ శ్రీరాముడు మానవుడుగా పరిపూర్ణ జీవితం గడిపాడని, ఎన్నో కాలాలుగా ప్రజలు కూడా అలాగే జీవించేలా రాముడు ఆదర్శంగా నిలిచాడని అన్నారు. అందువల్లనే ఆయన మనకు ఆరాధ్య దైవంగా నిలిచాడని, ఆయన్ను భగవంతుడుగా పూజిస్తున్నామని, ఆయన జీవితాన్ని అనుసరించేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు.

బి.ఎస్.ఎఫ్. జవాన్లు తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి, అత్యంత జటిలమైన విధులను నిర్వర్తిస్తూ, ప్రతికూల పరిస్థితుల మధ్య సరిహద్దులను కాపాడుతున్నారని అమిత్ షా అన్నారు. సరిహద్దు రక్షణలో ప్రాణత్యాగం చేసిన వారందరికీ భరతజాతి తరఫున తాను నివాళులర్పిస్తున్నానని అమిత్ షా అన్నారు. జీవితకాల విధి నిర్వహణ అనే నినాదాన్ని సంపూర్ణంగా పాటిస్తున్నందుకు బి.ఎస్.ఎఫ్. జవాను నుంచి, డైరెక్టర్ జనరల్ వరకూ అందరికీ ప్రజలందరి తరఫునా కృతజ్ఞతలు తెలుపురున్నానని, వారి ధైర్యసాహసాలకు నమస్కరిస్తున్నానని అన్నారు. దేశంలో ఎప్పుడు ఏ సంక్షోభం ఎదురైనా, బి.ఎస్.ఎఫ్. తన ధైర్య సాహసాలను ప్రదర్శిస్తూ వచ్చిందని అన్నారు. ఒక మహావీర చక్ర, నాలుగు కీర్తి చక్రలు, 13 వీర చక్రలు, 13 శౌర్య చక్ర అవార్డులను తమ ధైర్యసాహసాలకు పురస్కారాలుగా బి.ఎస్.ఎఫ్. సాధించిందని, మరెన్నో త్యాగాలు చేసిందని, బి.ఎస్.ఎఫ్. సిబ్బంది ధైర్య సాహసాలు దేశమంతటికీ గర్వకారణమేనని ఆయన అన్నారు.

నడాబెట్ సీమాదర్శన్ ప్రాజెక్టును నెలకొల్పడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చూపిన దార్శనికతను తాను గౌరవిస్తున్నానని, అభినందిస్తున్నానని అన్నారు. నడాబెట్ పర్యాటక వసతులను స్వయంగా సందర్శించినపుడే ప్రధాని దార్శనికత అంటే ఏమిటో ఎవరికైనా అవగాహనకు వస్తుందని ఆయన అన్నారు. ఇక్కడికి వచ్చిన తర్వాత, నడాబెట్ ప్రదర్శనను పూర్తిగా తిలకించినపుడు, ఇక్కడి నుంచి సరిహద్దు వరకూ వెళ్లినపుడు, మాత్రమే.. సరిహద్దు భద్రతకోసం మన రక్షణకోసం ప్రతికూల పరిస్థితుల్లో కూడా గార్డులు చేస్తున్న కృషి మనందరికీ అవగాహనకు వస్తుందని అన్నారు. ఇక్కడికి రావడం వల్ల చిన్నారుల్లో దేశభక్తి భావం అలవడుతుందని, సాయుధ బలగాలతో, సరిహద్దు భద్రతా బలగంతో సంబంధ బాధ్యవ్య భావన ఏర్పడుతుందని ఆయన అన్నారు. ఈ ప్రాంతానికి పర్యాటకుల సందర్శన మొదలైతే పర్యాటక కార్యకలాపాలకు గట్టి ఊపు లభిస్తుందని, సరిహద్దు గ్రామాలనుంచి ఇతర ప్రాంతాలకు ప్రజల వలసలు కూడా తగ్గిపోతాయని, స్థానికంగా ఉపాధి కల్పన పెరుగుతుందని అన్నారు. ఇది ఆరంభం మాత్రమేనని, దేశంలో జరిగే అభివృద్ధి సరిహద్దు ప్రాంతపు చివరి గ్రామానికి చేరడానికి ఈ ప్రాజెక్టుతోనే అవకాశం ఏర్పడుతుందని అమిత్ షా అన్నారు. పదేళ్ల తర్వాత నడాబెట్ ప్రాంతం బనస్కాంట జిల్లాలోని ఐదు లక్షల మందికి ఉపాధి కల్పనా కేంద్రంగా ఎదుగుతుందని భావిస్తున్నట్టు ఆయన చెప్పారు.

పర్యాటకులకోసం ఇక్కడ 3 ఆగమన వసతి సదుపాయాలను, విశ్రాంతి వసతులను, 500 మంది కూర్చున గలిగే ఒక ఆడిటోరియంను, దుస్తులు మార్చుకునే గదులను ఏర్పాటు చేశారని, 22 దుకాణాలను, రెస్టారెంట్లను కూడా నిర్మించారని అలంకరణకోసం విద్యుద్దీపాలతో ఏర్పాట్లు చేస్తున్నారని అన్నారు. ఇక్కడ వినియోగించే విద్యుత్తులో 30శాతం సౌరశక్తి ద్వారానే ఉత్పత్తి అవుతోందని అన్నారు. చిన్నారులకు ఆట స్థలం, వంద అడుగుల ఎత్తున రెపరెపలాడే త్రివర్ణ జాతీయ పతాకం ఇక్కడ ప్రధాన ఆకర్షణగా నిలువనున్నాయన్నారు. సరిహద్దు గురించి సందర్శకులకు వివరించే ఆరు గ్యాలరీలను ఇక్కడ నిర్మించారన్నారు. గుజరాత్ పర్యాటకం కోసం ఒక గ్యాలరీని, నడాబెట్ గురించి వివరించే ఒక గ్యాలరీని, బనస్కాంటా ప్రాంతాన్ని గురించి తెలియజెప్పే మరో గ్యాలరీని కూడా నిర్మించారు. బి.ఎస్.ఎఫ్. 3 విభాగాలైన, సుముద్రయాన దళం, వైమానిక, శతఘ్ని దళాలను గురించి వివరించేందుకు మరో గ్యాలరీని నిర్మించారన్నారు.

సరిహద్దు పర్యాటకం గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కలలు గన్నారని, అవి ఇపుడు ఆయన చొరవతోనే సాకారమయ్యాయని, ఇక్కడ నిర్వహించే బీటింగ్ రిట్రీట్ వేడుక ఒక ప్రధాన ఆకర్షణగా నిలువబోతోందని అమిత్ షా అన్నారు. సరిహద్దు పర్యాటకం, సరిహద్దు రక్షకుల ద్వారా ప్రజలకు సమాచారం సౌలభ్యం, సరిహద్దు రక్షకుల పట్ల ప్రజల్లో ఆకర్షణ భావం.. ఈ మూడు లక్ష్యాలు తాజా ప్రాజెక్టుతో నెరవేరగలవని ఆయన అన్నారు. మన సరిహద్దు భద్రతకు, మౌలిక సదుపాయాల నిర్మాణానికి నరేంద్ర మోదీ ఎంతో చొరవ తీసుకున్నారని, ఈ సందర్భంగా ప్రజలందరికీ ప్రత్యేకించి బనస్కాంట వాసులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని అమిత్ షా అన్నారు. ఇపుడు నడాబెట్ పర్యాటక స్థలంతో బనస్కాంట ప్రాంతం గుజరాత్ రాష్ట్రానికి మాత్రమే కాక, దేశ ప్రజలందరికీ ఆకర్షణగా నిలవగలదని అన్నారు. బి.ఎస్.ఎఫ్. ధైర్య సాహసాలను గురించి అతి సన్నిహితంగా తెలుసుకునేందుకు దేశంలోని ప్రజలందరికీ ఒక అవకాశం సీమాదర్శన్ ప్రాజెక్టు రూపంలో అందుబాటులోకి వచ్చిందని అమిత్ షా అన్నారు.

# ఏపీలో కొలువుదీరిన కొత్త మంత్రివర్గం




అమరావతి, ఏప్రిల్ 11:ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొత్త కేబినెట్ కొలువుదీరింది. 25 మంది కొత్త మంత్రుల చేత రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ సోమవారం ప్రమాణ స్వీకారం చేయించారు. పాత మంత్రివర్గంలోని 11 మందిని మళ్లీ మంత్రివర్గంలో తీసుకోగా.. కొత్తగా 14 మందికి స్థానం కల్పించారు. అక్షర క్రమంలో కొత్త మంత్రుల పేర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సమీర్ శర్మ చదువుతూ ఉండగా.. ఆ ప్రకారం వారితో గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించారు.

తొలుత మంత్రిగా అంబటి రాంబాబు ప్రమాణం చేశారు. అనంతరం అంజాద్ బాషా, ఆదిమూలపు సురేష్, బొత్స సత్యనారాయణ, బూడి ముత్యాలనాయుడు, బుగ్గన రాజేంద్రనాథ్, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, దాడిశెట్టి రాజా, ధర్మాన ప్రసాదరావు, గుడివాడ అమర్‌నాథ్, గుమ్మనూరు జయరాం, జోగి రమేష్, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కారుమూరి నాగేశ్వరరావు, కొట్టు సత్యనారాయణ, నారాయణస్వామి, ఉషాశ్రీ, చరణ్, మేరుగ నాగార్జున, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పినిపే విశ్వరూప్, పి.రాజన్న దొర, ఆర్కే రోజా, తానేటి వనిత, సీదిరి అప్పలరాజు, విడదల రజినీ మంత్రులుగా ప్రమాణం చేశారు. వీరిలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆదిమూలపు సురేష్, ఉషాశ్రీ చరణ్ ఆంగ్లంలో ప్రమాణం చేశారు.

ప్రమాణ స్వీకారం అనంతరం గవర్నర్, ముఖ్యమంత్రితో మంత్రులుగ్రూపు ఫొటో దిగారు.

ఆ వెంటనే సచివాలయంలో గవర్నర్, సీఎం, కొత్త, పాత మంత్రులు, అధికారులకు తేనీటి విందుకు హాజరయ్యారు. ఇదిలా ఉంటే.. అనుభవం, సామాజిక సమీకరణలు దృష్టిలో ఉంచుకుని సీఎం వైఎస్ జగన్.. పాత, కొత్త కలయికతో కొత్త మంత్రివర్గాన్ని కూర్పు చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు, మహిళలకు మంత్రి వర్గంలో పెద్దపీట వేశారు. కాగా, ఈ నెల 7వ తేదీన 24 మంది మంత్రులు రాజీనామాలు సమర్పించిన సంగతి తెలిసిందే.

## అమర్‌నాథ్ యాత్ర కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: అమర్‌నాథ్ యాత్రకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. కొవిడ్ మహమ్మారి కారణంగా రెండేళ్ల పాటు యాత్ర రద్దయ్యింది. ఈ ఏడాది జూన్ 30న యాత్ర ప్రారంభం కానుండగా.. దేశంలో కరోనా ఉధృతి తగ్గిన నేపథ్యంలో భక్తులను అనుమతించేందుకు దేవస్థానం బోర్డు అనుమతి ఇచ్చింది. అయితే, ఈ ఏడాది జమ్మూకశ్మీర్ ప్రభుత్వం రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ (ఖీఈఎఅ) వ్యవస్థను ప్రవేశపెట్టనున్నది. యాత్రికుల కదలికలను ట్రాక్ చేయనుండగా.. యాత్రికుల భద్రత కోసం వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు అధికారులు తెలిపారు.

అయితే, అమర్‌నాథ్ యాత్ర కోసం దేవస్థానం బోర్డు (రాయాః) వెబ్‌సైట్‌తో పాటు దేశవ్యాప్తంగా 566 చోట్ల పేర్లు నమోదు చేసుకునేందుకు అవకాశం ఇచ్చింది. ఈ సందర్భంగా దేవస్థానం బోర్డ్ మార్గదర్శకాలను జారీ చేసింది. 13 సంవత్సరాల కంటే తక్కువ, 75 సంవత్సరాల కంటే ఎక్కువ వయసున్న వారు రిజిస్ట్రేషన్‌కు అర్హులు కాదని పేర్కొంది. ఆరు వారాలు దాటిన గర్భిణులకు సైతం అవకాశం లేదని పేర్కొంది. రిజిస్ట్రేషన్ కోసం బష్ట్రతీతిజీఎజీతీనిజీబిష్ట్రతీతిబష్ట్రతీతినివ.ఇఁనీఎ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవచ్చని పేర్కొంది. ఆ తర్వాత 'రిజిస్ట్రేషన్ ఆన్‌లైన్'పై క్లిక్ చేస్తే కొత్త ట్యాబ్ ఓపెన్ అవుతుందని.ఇందులో రిజిస్టర్ క్లిక్ చేసి.. అవసరమైన అన్ని వివరాలు ఇవ్వాలని సూచించింది. ఇదిలా ఉండగా జమ్మూకశ్మీర్‌తో పాటు దేశవ్యాప్తంగా ఉన్న 316 బ్రాంచ్‌లలో అమర్‌నాథ్ యాత్ర రిజిస్ట్రేషన్ ప్రారంభమైందని జమ్మూ సర్కిల్‌లోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ యతీందర్ కుమార్ పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు ఎస్ఏఎస్‌బీ సూచించిన ఆసుపత్రిల నుంచి తప్పనిసరిగా ధ్రువీకరణపత్రం, నాలుగు ఫొటోలతో పాటు రూ.120 ఫీజు చెల్లించాలన్నారు. జమ్మూ అండ్ కశ్మీర్ బ్యాంక్, ఎస్ బ్యాంక్‌తో పాటు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన పలు బ్రాంచ్‌ల్లోనూ రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉందని అ ధికారులు పేర్కొన్నారు.

## క్రమశిక్షణను ఉల్లంఘించే నేతలను పార్టీ నుంచి సాగనంపుతాం : పంజాబ్ కాంగ్రెస్ చీఫ్

చండీఘఢ్, ఏప్రిల్ 11:: పార్టీలో క్రమశిక్షణను ఉల్లంఘించే నేతలను బయటకు పంపుతామని, క్రమశిక్షణా రాహిత్యాన్ని ఉపేక్షించబోమని పంజాబ్ కాంగ్రెస్ చీఫ్‌గా నూతనంగా నియమితులైన అమరీందర్ సింగ్ రాజా స్పష్టం చేశారు. ఏమైనా సమస్యలుంటే పార్టీ వేదికలపైనే నేతలు ప్రస్తావించాలని, సమస్యలను అంతర్గతంగానే పరిష్కరించుకోవాలని అన్నారు. పార్టీలో క్రమశిక్షణను ఉల్లంఘించేవారు మంత్రయినా, సీఎం అయినా, తాను అయినా పార్టీ నుంచి బయటకు సాగనంపుతామని తేల్చిచెప్పారు. ఇక అమరీందర్ సింగ్ రాజాతో పాటు సీఎల్పీ నేత ప్రతాప్ సింగ్ బజ్వా, పంజాబ్ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భరత్ భూషణ్ అషు సహా పలువురు పార్టీ నేతలు సోమవారం ఢిల్లీలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని కలిసి సంప్రదింపులు జరిపారు.

# రైతులకు సరైన ధర లభించడం లేదు: ఎమ్మెల్సీ కవిత



న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: రైతులు పండించిన పంటకు సరైన ధర లభించడం లేదని ఎమ్మెల్సీ కవిత (ఓఒఅ ఐజీలతిబిష్ట్రజీ)అన్నారు. తెలంగాణలో పండిన మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని చెప్పారు. రాష్ట్రంలో పండిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ తెలంగాణ భవన్ వేదికగా టీఆర్ఎస్ దీక్ష కొనసాగుతున్నది. ఇందులో మంత్రులు, టీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఒకే విధంగా ధాన్యం సేకరణ విధానం ఉండాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రైతు నేత రాకేష్ టికయిత్ తమకు మద్దతు ఇవ్వడానికి దీక్షలో పాల్గొన్నారని చెప్పారు. ఇప్పటికే ఆయన వ్యవసాయ సమస్యలపై సీఎం కేసీఆర్‌తో మాట్లాడారన్నారు.

# కేసీఆర్‌ది అన్నదాతల ప్రభుత్వం : మంత్రి నిరంజన్ రెడ్డి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: ముఖ్యమంత్రి కేసీఆర్‌ది అన్నదాతల ప్రభుత్వం అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు. ధాన్యం సేకరణపై ఢిల్లీలోని తెలంగాణ భవన్ వేదికగా టీఆర్ఎస్ పార్టీ చేపట్టిన నిరసన దీక్షలో మంత్రి నిరంజన్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు.

ఢిల్లీలో దీక్ష చేయడం మనకు సంతోషం కాదు. కానీ ఇలాంటి అనివార్య పరిస్థితులు కల్పించింది కేంద్రం అని మంత్రి మండిపడ్డారు. కేంద్ర మోసపూరిత వైఖరిని గ్రహించిన సీఎం కేసీఆర్ రైతులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేశారు. వానాకాలం పంటను కొనే సమయంలోనే యాసంగి పంటను కొనమని బీజేపీ చెప్పింది. సీఎం కేసీఆర్, మంత్రుల బృందం అనేకసార్లు కేంద్ర ప్రభుత్వం వద్దకు వచ్చి విజ్ఞప్తులు చేసినప్పటికీ కేంద్రం పట్టించుకోలేదు. ధాన్యం సేకరణపై ప్రధానికి సీఎం కేసీఆర్ లేఖ రాసినా ఉలుకు పలుకు లేదు. రకరకాల షరతులు విధించిన కేంద్రం.. రైతుల ఉసురు పోసుకుంటున్నది.

తెలంగాణ రైతులను అవమానించేలా కేంద్ర మంత్రి మాట్లాడిండు. కనీస మర్యాద లేకుండా మాట్లాడటం అత్యంత దుర్మార్గం. తెలంగాణ సమాజం కేంద్ర ప్రభుత్వాన్ని క్షమించదు. తెలంగాణ రైతులు చెమటోడ్చి పంజాబ్ కంటే అధికంగా ధాన్యం పండించారు. కేసీఆర్ వల్లే తెలంగాణ రైతులు భారీ స్థాయిలో ధాన్యం పండించి, దేశంలోనే అగ్రస్థానంలో నిలిచారు. రైతుల ప్రయోజనాల విషయంలో కేంద్రం పాత్ర లేదు. కేంద్రానికి రైతులు చెమటలు పట్టించే రోజులు వచ్చాయన్నారు. నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతులు కేంద్రానికి చుక్కలు చూపించారు. అబద్ధాలతో బీజేపీ పరిపాలన కొనసాగిస్తోంది అని మంత్రి నిరంజన్ రెడ్డి ఆగ్రహం వెలిబుచ్చారు.

# హెలీనా మిస్సైల్‌ను పరీక్షించిన డీఆర్డీవో



న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: యాంటీ ట్యాంక్ గైడెడ్ మిస్సైల్ హెలీనాను ఇవాళ డీఆర్డీవో పరీక్షించింది. స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన హెలికాప్టర్ నుంచి ఈ ప్రయోగం జరిగింది. డీఆర్డీవో శాస్త్రవేత్తలు ఈ ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఇండియన్ ఆర్మీ, ఇండియన్ ఎయిర్ ఫోర్స్ కూడా ఈ పరీక్షలో పాల్గొన్నది. హై ఆల్టిట్యూడ్ పర్వత శ్రేణుల్లో ఈ పరీక్ష జరిగినట్లు డీఆర్డీవో తెలిపింది. అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్(ఏఎల్‌హెచ్) ద్వారా ట్రయల్స్ నిర్వహించారు. ట్యాంక్‌ను టార్గెట్ చేస్తూ మిస్సైల్‌ను ఫైర్ చేశారు. ఇన్‌ఫ్రారెడ్ ఇమేజింగ్ సీకర్ ఆ క్షిపణిని గైడ్ చేయనున్నది.

# కోతలకు వేళాయే.. గంటల తరబడి కరెంట్ కట్

అమరావతి, ఏప్రిల్ 11: కర్నూలు జిల్లాలో విద్యుత్ కోతలు ప్రారంభమయ్యాయి. డిమాండు కు తగ్గ సరఫరా లేకపోవడంతో ఈఎల్ఆర్ పేరుతో విద్యుత్ సరఫరా ఆఫ్ చేస్తున్నారు. పరిశ్రమలకు రెగ్యులర్ హాలిడేతో పాటు- సోమవారం పవర్ హాలిడే ప్రకటించారు. ఫలితంగా వారంలో ఐదు రోజులు మాత్రమే పరిశ్రమలు పని చేయనున్నాయి. 24 గంటలు పని చేసే పరిశ్రమ అయితే రోజూ వినియోగించే విద్యుత్తులో 50 శాతమే వాడాల్సి ఉంటు-ంది. మున్సిపాలిటీ కార్పొరేషన్ పరిధిలో రోజూ అరగంట పాటు విద్యుత్ కోత ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల మధ్యలో గంట పాటు కోత విధించేందుకు అధికారులు సిద్ధమైనట్టు తెలిసింది.జిల్లాలో అన్ని విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి 16.4 మిలియన్ల వినియోగం ఉంది. వేసవి నేపథ్యంలో విద్యుత్ వాడకం బాగా పెరిగింది. 11.5 మిలియన్ యూనిట్ల విద్యుత్ సరఫరా అందిస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం రోజుకు 400 మెగావాట్ల విద్యుత్ సరఫరా చేసేందుకు అధికారులు కొత్త నిబంధనలు అమలు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు- తెలిసింది. జిల్లాలో గృహ కనెక్షన్లు11.7 లక్షలు. వ్యవసాయానికి సంబంధించి1.99 లక్షలు వాణిజ్యానికి సంబంధించి11.741 కనెక్షన్లు ఉన్నాయి.

ఇప్పటికే విద్యుత్ కోతలతో విద్యార్థులు. రైతులు. చిన్న మధ్య తరహా పరిశ్రమలు. వైద్యశాలలు. నాపరాతి పరిశ్రమ లు. అవస్థలు పడుతున్నారు. 24 గంటలు పని చేసే పరిశ్రమలు 50 శాతం విద్యుత్ వినియోగించేలా ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో నాపరాతి పరిశ్రమలు1100 వరకు ఉన్నాయి. దీని ద్వారా ప్రత్యక్షంగా పరోక్షంగా 25 వేల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. నిత్యం రూ 600 నుంచి 750 వరకు కూలి పొందుతున్నారు. విద్యుత్ అంతరాయం కలగడంతో రూ రెండు వందల రూపాయలకు పడిపోయింది. కార్మికులకు ఉపాధి కరవై రోజులు ఎదురవుతున్నాయి.

# రుద్రవరంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 11:(నేటినిజం ప్రతినిధి):అణగారిన కులాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతి రావు పూలే జయంతి వేడుకలను వేములవాడ మండలం రుద్రవరం గ్రామంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం స్థానిక సర్పంచ్ ఉరిడి రాంరెడ్డి మాట్లాడుతూ సామాజిక అసమానతల మీద అలుపెరుగని పోరాటం చేసి,అణగారిన వర్గాల దళితులు, స్త్రీలు, ఇతర బలహీన వర్గాల విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త,కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాటం చేసిన సామాజిక తత్వవేత్త మహాత్మా జ్యోతిరావు అని అన్నారు. ఈ కార్యక్రమాన్ని కిముఖ్య అతిథులుగా ఎంపీపీ బుర్ర వజ్రమ్మ బాబు ,జడ్పీటీసీ మ్యాకల రవి ,ఎంపీటీసీ గాలిపెల్లి సువర్ణ స్వామిగౌడ్,వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఊరి డిప్రవీణ్, వార్డు సభ్యులు నడిగొట్ల హరికృష్ణ, పావని కనకయ్య , పీఏ సీఎస్ డైరెక్టర్లు కట్టఎల్లయ్య , కత్తి కనకయ్య , మెడికల్ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# షెటిల్ కోర్టును ప్రారంభించిన ప్రజా ప్రతినిధులు



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 11:(నేటినిజం ప్రతినిధి):రుద్రవరం గ్రామం లో కీ :శే పాముల తిరుపతి జ్ఞాపకార్థం వార్డ్ సభ్యులు బెజుగం మహేష్ ఆధ్వర్యంలో షెటిల్ కోర్టు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ బూర వజ్రమ్మ బాబుజడ్పీటీసీ మ్యాకల రవి సర్పంచ్ ఊరడి రాంరెడ్డి, ఎంపీటీసీ గాలిపెల్లి సువర్ణ స్వామి మార్కెట్ కమిటీ వైస్ చేర్మెన్ ఊరడి ప్రవీణ్ హాజరై ప్రారంభించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో మానసిక ఉల్లాసం, శారీరక ధృఢత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు ఈ. కార్యక్రమం లో వార్డ్ సభ్యులు నడిగొట్ల హరికృష్ణ, అతికం పావని కనుకయ్య, మాజీ సర్పంచ్ పిల్లి రేణుక కనుకయ్య, పీఏ సీఎస్ డైరెక్టర్ కట్ట ఎల్లయ్య, కత్తి కనుకయ్య, అనుముల మల్లేశం,గాలిపెల్లి బాబు, పచ్చిమట్ల మల్లేశం, తునికి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.×

# ఇండియన్ ఫార్మ, గ్లోబల్ హెల్త్ కేర్ ఐడిఎమ్ఎ డైమండ్ జూబ్లీ వేడుకలు

హైదరాబాద్, ఏప్రిల్ 11: ఇండియన్ డ్రగ్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ 60వ సంవత్సర వేడుకల సందర్భంగా, మొత్తం థీమ్ 'ఇండియన్ ఫార్మా గ్లోబల్ హెల్త్‌కేర్' చుట్టూ తిరుగుతుంది. ఐడిఎమ్ఎ అందరికీ శుభాకాంక్షలు తెలియచేసింది. దారా పటేల్, సెక్రటరీ జనరల్ ఐడిఎమ్ఎ, భరత్ షా, చైర్మన్ ఐడిఎమ్ఎ డైమండ్ జూబ్లీ ఆర్గనైజింగ్ కమిటీ, మహేష్ దోషి, తక్షణ గత జాతీయ అధ్యక్షుడు డాక్టర్ విరంచి షా, జాతీయ అధ్యక్షుడు రెండు రోజుల అసాధారణ వేదిక ముఖ్య అతిథి, ఆరోగ్య కుటుంబ సంక్షేమం మరియు రసాయనాలు, ఎరువుల మంత్రి డాక్టర్ మన్సుఖ్ ప్రసంగంతో వేడుకలు ప్రారంభిస్తారని విరంచి తెలిపారు. భారతీయ ఫార్మాస్యూటికల్ పరిశ్రమ యొక్క ప్రయత్నాలను ప్రదర్శిస్తూ, ఈ ఉత్సవం కొనసాగనుందన్నారు. , 25 కంటే ఎక్కువ మంది స్పీకర్లు, ప్రమోటర్ నాయకులు, సి సూట్ నిపుణులు పరిశ్రమలోని పెట్టుబడిదారులతో నెట్‌వర్క్‌కు అందించే ఆలోచనలు, భవిష్యత్ ప్రణాళికలు విశ్లేషించనున్నారు. ప్యానెల్ చర్చ 'గ్లోబల్ వ్యాక్సిన్ డెవలప్‌మెంట్‌లో దాని పాత్ర' 'ది ఫార్మా ఇండస్ట్రీ: రేపటికి పివోటింగ్', 'ప్రైవేట్ ఈక్విటీ: ఫార్మా ఎస్ ఎమ్ ఇ ఇంధన వృద్ధి' మరియు 'అంతరాయం: ఉత్పత్తి నుండి వినియోగదారునికి విలువను పెంచడం 'ఇన్‌ఫ్లెక్షన్ పాయింట్ ఇండియా: స్థానం గ్లోబల్ హబ్‌గా. మరీ ముఖ్యంగా, 60వ సంవత్సర వార్షిక ప్రచురణ 2022 విడుదల చేయనన్నారు., డైమండ్ జూబ్లీ కోర్ టీమ్‌కు సన్మానం వివిధ ముఖ్యమైన ప్రతిష్ఠాత్మకమైన అవార్డులను అందించడం ఈవెంట్ సమయంలో గుర్తించదగిన ఆకర్షణీయమైన కార్యక్రమాలు జరుగనన్నాయి. రెండవ రోజు కార్యక్రమంలో విరంచి షా, జాతీయ అధ్యక్షుడు, వ్యవస్థాపకులకు నిర్వహణ చిట్కాలు - డాక్టర్ జ్ఞానవత్సల్ స్వామి లైఫ్ కోచ్ ప్రముఖ వక్త ద్వారా ప్రాచీన గ్రంథాల నుండి స్ఫూర్తిని అందజేస్తారు. ముఖ్య అతిథిగా, వాణిజ్యం పరిశ్రమలు, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం ప్రజాపంపిణీ మరియు జౌళి శాఖల గౌరవ మంత్రి పీయూష్ గోయల్ సభనుద్దేశించి మాట్లాడుతారు.. మెహుల్ షా కృతజ్ఞతతో, గౌరవం. జనరల్ సెక్రటరీ డైమండ్ జూబ్లీ వేడుకలు విజయవంతంగా ముగుస్తాయి అని సంస్థ విడుదల చేసిన ప్రకటనలో వివరించింది.

# మార్కెట్లోకి టి టి కె ప్రెస్టీజ్ కొత్త ప్లాటినా నాన్-స్టిక్ రేంజ్ స్టెయిన్‌లెస్ స్టీల్ ఉత్పత్తులు




హైదరాబాద్, ఏప్రిల్ 11: ప్లాటినా నాన్-స్టిక్ రేంజ్‌తో మీ వంటసామాను ఎలివేట్ చేయండి, ఇది స్టెయిన్‌లెస్-స్టీల్ నాన్-స్టిక్ కుక్‌వేర్ శ్రేణికి సొగసైన అదనంగా ఉంటుంది. ఇంట్లో వంట చేసేవారు స్టెయిన్‌లెస్ స్టీల్ యొక్క స్వచ్ఛతను నాన్-స్టిక్ సౌలభ్యంతో ఆనందించవచ్చు. ప్లాటినా అనేది ఒక ప్రత్యేకమైన నాలుగు పొరల నాన్-స్టిక్ కోటెడ్ స్టెయిన్‌లెస్ స్టీల్ వంటసామాను శ్రేణి, ఇది తక్కువ నూనెను ఉపయోగిస్తుంది, ఇది స్క్రాచ్ రెసిస్టెంట్ మరియు మెటల్ స్పూన్ ఫ్రెండ్లీ. దాని దృఢమైన వేడి నిరోధక హ్యాండిల్స్ వంట చేసేటప్పుడు సులభంగా హ్యాండిల్ చేయడానికి అనుమతిస్తుంది. అన్ని విధాలుగా ఉన్నతమైనది, ప్లాటినా నాన్-స్టిక్ మీ వంటగదికి సరైన జోడింపుహైదరాబాద్, ఏప్రిల్: టి టి కె ప్రెస్టీజ్ వంట సామాగ్రి శ్రేణిని ప్రత్యేకమైన ఇంపాక్ట్ ఫోర్జ్డ్ బాటమ్‌తో సన్నద్ధం చేయడంతోపాటు ఆహారం వేగంగా సమానంగా ఉడుకుతుందని నిర్ధారించింది. గట్టి గాజు మూత మరియు వేడిని తట్టుకునే హ్యాండిల్స్ ప్రతి వంటగదిలో తప్పనిసరిగా ఉండాల్సినవి. ప్లాటినా నాన్-స్టిక్ రేంజ్ బర్నింగ్, అసమాన వంటలను నివారించడానికి ప్రత్యేకంగా రూపొందించబడింది. అదనపు సౌలభ్యం కోసం, ప్లాటినా గ్యాస్ స్టవ్‌లు, ఇండక్షన్ కుక్‌టాప్‌లపై పనిచేస్తుంది. శ్రేణిలో మూతలు ఫ్రైయింగ్ ప్యాన్‌లతో కూడిన కడైలు ఉంటాయి అని సంస్థ విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

# తాను చెప్పింది ఆచరించిన మహామనిషి జ్యోతిబాపూలే: మంత్రి ఎర్రబెల్లి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 11:గొప్ప సామాజిక వేత్తగా అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన మహామనిషి జ్యోతిబాపూలే అని పంచాయితీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కొనియాడారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ని పురస్కరించుకుని ఢిల్లీలోని తెలంగాణ భవన్ లో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘసేవకుడిగా కుల వివక్ష పై ఆనాడే పోరాటం చేసిన మహానుభావుడు జ్యోతిబాపూలే అన్నారు. తాను చెప్పింది ఆచరించిన గొప్ప మనిషి అని,సమాజంలో సగ భాగంగా ఉన్న స్త్రీలు అభివృద్ధి చెందకపోతే సమాజం అభివృద్ధి చెందదని పూలే భావించాడని అన్నారు.

అందువల్ల స్త్రీలు విద్యావంతులు కావాలని నమ్మాడు.ఇతరులకు ఆదర్శంగా ఉండాలని ముందుగా తన భార్య సావిత్రిని పాఠశాలకు పంపాడు.ఈ పాఠశాలలో అన్ని కులాలకు ప్రవేశం కల్పించడం, అంటరానివారికి కూడా విద్యా బోధిన చేశారని అన్నారు.1864లో "బాలహత్య ప్రతిబంధక్ గృహ" స్థాపించి, వితంతు వులైన గర్భిణీ స్త్రీలకు అండగా నిలిచాడు. దేశంలోనే ఇటువంటి కేంద్రం స్థాపించడం ఇదే మొదటిసారి.సత్య శోధక సమాజాన్ని పూలే స్థాపించాడు. దేశంలోనే ఇది మొట్ట మొదటి సంస్కరణోద్యమం. సమానత్వం, స్వేచ్ఛ, ఐకమత్యంతో కూడిన సమసమాజం ఉండాలన్న గొప్ప వ్యక్తి జ్యోతిబాపూలే అన్నారు.

నైజాం సంస్థానంలో న్యాయమూర్తి పదవిని కూడా ఆయన కాదన్నాడు. సామాజిక ఉద్యమకారునిగా సుప్రసిద్ధులైన ఆయన పుణే మునిసిపాలిటీకి ఎన్నికై, 12 ఏళ్ళు ప్రజాప్రతినిధిగా పనిచేశారని చెప్పారు.మహాత్మా పూలే ఆలోచన విధానం స్ఫూర్తిగా తెలంగాణ ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తున్నదని,సీఎం కేసీఆర్ కుల వృత్తులకు సామాజిక గౌరవం కల్పించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలు పాల్గొన్నారు.

# ఒక్క కాయ ధర రూ.20..ఎందుకిలా..?

హైదరాబాద్, ఏప్రిల్ 11:ప్రతి ఒక్కరూ తమ రోజువారీ జీవితంలో నిమ్మకాయలు వాడటం తప్పనిసరి. ఆహారంలో తీసుకున్నా.. ఉదయాన్నే నిమ్మకాయ షర్బత్ తాగినా రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఇక వేసవిలో నిమ్మకాయ షర్బత్ తాగితే వడదెబ్బ ప్రభావం పడదు. కానీ ఇప్పుడు సామాన్యుడు కొనలేని స్థాయికి నిమ్మకాయ ధర పెరిగిపోయింది. దేశవ్యాప్తంగా ఒక నిమ్మకాయ ధర రూ.15-20 మధ్య పలుకుతున్నది. నెల రోజుల క్రితం రూ.70-80లకు లభించిన కిలో నిమ్మకాయ కోసం ఇప్పుడు రూ.300-400 పెట్టాల్సి వస్తున్నది. ఈ లెక్కన నిమ్మకాయల ధరలు దాదాపు ఆరు రెట్లు పెరిగాయి.

**ఏలూరులో నిమ్మ సాగు ఇలా**

నిమ్మకాయ తోటల పెంపకానికి ఆంధ్రప్రదేశ్ భూములు సరైనవి. నిరంతరం నీటి సరఫరా చేయాల్సిన అవసరం లేదు. మొక్క నాటిన 3-4 ఏండ్ల నుంచి మరో ఐదేండ్ల వరకు నిమ్మకాయలు పండుతునే ఉంటాయి. నిమ్మకాయ ధరల పెరుగుదలకు నాలుగు ప్రధాన కారణాలు కనిపిస్తున్నాయి. దేశంలోకెల్లా అతిపెద్ద నిమ్మకాయల మార్కెట్ ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరులో ఉంది. ఏలూరు నుంచే దేశవ్యాప్తంగా 40-45 శాతం అవసరాలకు నిమ్మకాయలు రవాణా అవుతాయి. ఏలూరు మండిలో 20 వేల మందికి పైగా నిమ్మకాయల రైతులు తమ పేర్లు రిజిస్టర్ చేసుకున్నారు.

**25 ట్రక్కుల నుంచి ఐదు ట్రక్కులకు..**

ఏలూరు నుంచి సాధారణంగా ప్రతిరోజూ 25 ట్రక్కుల నిమ్మకాయలు ఇక్కడి నుంచి దేశ నలుమూలలకు తరలి వెళ్తాయి. ఒక ట్రక్కులో 21 టన్నుల నిమ్మకాయలు ఉంటాయి. కానీ ఇప్పుడు కష్టంగా ఏలూరు నుంచి కేవలం ఐదు ట్రక్కుల నిమ్మకాయలు రవాణా అవుతున్నాయి. సాధారణ సీజన్‌తో పోలిస్తే ఐదు రెట్లు తక్కువ. ఇంకా బాలాజీ జిల్లాలోని గూడూరు మండి నుంచి, మరో 10 శాతం రాజమహేంద్రవరం (రాజమండ్రి) మండీల్లో లభిస్తాయి. అహ్మదాబాద్‌లోని అతిపెద్ద కూరగాయల మార్కెట్, జమల్‌పూర్, కలుపూర్, రాజస్థాన్‌లోని పాలివాల్ ప్రాంతాల్లో నిమ్మకాయలు ఎక్కువగా లభిస్తాయి.

టన్ను నిమ్మకాయ ధర రూ.31 లక్షలు

ఒక టన్ను నిమ్మకాయల ధర రూ.5 లక్షల నుంచి రూ.31 లక్షలకు పెరిగింది. రెండేండ్లుగా రైతులు భారీగా నష్టపోయారు. దీనికి కారణం కరోనా మహమ్మారే. కరోనాను నిరోధించేందుకు నిమ్మకాయలు విరివిగా వాడినా దాని కట్టడికి 2020లో విధించిన లాక్‌డౌన్ వల్ల మార్కెట్లు తెరుచుకోలేదు. ఫలితంగా ఏలూరులో ఐదెకరాల్లో నిమ్మసాగు చేసిన రైతు నష్టపోయారు. గతేడాది కురిసిన భారీ వర్షాలతో నిమ్మకాయల దిగుబడి బాగా పడిపోయింది. ఫలితంగా ప్రజల నిత్యావసరాల్లో ఒకటైన నిమ్మకాయ కొరత ఏర్పడింది. దీంతో రూ.5 లక్షలు పలికిన టన్ను నిమ్మకాయలు ఇప్పుడు రూ.31 లక్షలకు దూసుకెళ్లాయి.

**తుఫాన్ల వల్ల దెబ్బ తిన్న నిమ్మతోటలు**

గుజరాత్‌లోని జమల్‌పూర్ కలూపూర్ మార్కెట్లలో కిలో నిమ్మకాయలు రూ.140 -160 పలుకుతున్నాయి. నిమ్మకాయల విక్రయంతో తమకొచ్చే లాభాలు చాలా తక్కువ అని చెబుతున్నారు. గతేడాది తుఫాన్ల వల్ల సౌరాష్ట్రలో నిమ్మతోటలు దెబ్బ తిన్నాయని చెబుతున్నారు. ఫలితంగా రైతులు కూడా నష్టపోయారు. రైతులకు ఆదాయం తగ్గడంతోనే నిమ్మకాయల ధరలు పెరిగాయంటున్నారు.

**అహ్మదాబాద్‌లో రూ.400**

సౌత్ గుజరాత్‌ల్లో కిలో నిమ్మకాయలు రూ.200 లభిస్తుంటే, రిటైల్ దుకాణాల్లో రూ.300 పలుకుతున్నాయి. అహ్మదాబాద్‌లో రూ.140-160, మార్కెట్ బయట రూ.180-200లకు హోల్‌సేల్ వ్యాపారులు విక్రయిస్తున్నారు. చిన్న దుకాణాల వ్యాపారులు రూ.200-250కి కొనుగోలు చేస్తే సామాన్యుడి దగ్గరికి వచ్చే సరికి రూ.300-400లకు చేరుతున్నది.

**గుజరాత్‌కు ఇలా నిమ్మకాయల రవాణా**

గుజరాత్‌కు మహారాష్ట్ర, చెన్నై, కర్ణాటక రాష్ట్రాల నుంచి నిమ్మకాయలు రవాణా అవుతాయి. అహ్మదాబాద్‌లోనే రోజూ 150 టన్నులు వాడుతుంటారు. కానీ ఇప్పుడు రోజూ 70 టన్నులకు మించి నిమ్మకాయలు రాకపోవడం వల్లే వాటి ధరలు పెరిగాయని వ్యాపారులు అంటున్నారు. ముస్లింలకు రంజాన్ మాసం రావడంతోపాటు ఈ నెలలో భారీగా పెండ్లిళ్లు జరుగుతాయని, కనుక నిమ్మకాయల ధరలు మరింత పెరగడం ఖాయం అంటున్నారు వ్యాపారులు.

**నిమ్మ దిగుబడిపై టైట్ తుఫాన్ దెబ్బ**

రాజస్థాన్‌లోని ముహానా సబ్జీ మండి అధ్యక్షుడు రాహుల్ తవార్ మాట్లాడుతూ గతేడాది టైట్ తుఫాన్ వల్ల నిమ్మతోటలు దబ్బతిన్నాయని చెప్పారు. ఇంతకుముందుతో పోలిస్తే నిమ్మకాయల దిగుబడి బారీగా పడిపోయింది. పెట్రోల్, డీజిల్ ధరల పెంపుకూడా నిమ్మకాయల ధరలు పైపైకి దూసుకెళ్లాయంటున్నారు.

# యుద్ధభేరి పోస్టర్ ఆవిష్కరణ




రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 11:(నేటినిజం ప్రతినిధి):ఈనెల 12వ తేదీన హైదరాబాద్ లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జరిగే యుద్ధభేరి సభ పోస్టర్ ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా కో కన్వీనర్ గుండ థామస్ మాదిగ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని మార్చడం అనడం ప్రజాస్వామ్య వ్యవస్థను ప్రజల ప్రాథమిక హక్కులను స్వేచ్ఛను లేకుండా చేయడమే అన్నారు.అంతే కాకుండా సాంఘిక ఆర్థిక రాజకీయ సమానత్వని సమాధి చేసే రాజరిక వ్యవస్థను దొరల ఆధిపత్యాన్ని అన్ని రంగాలలో పెంచుకోవడమే అవుతుందన్నారు.అందుకే రాజ్యాంగాన్ని మార్చాలన్న కెసిఆర్ అహంకారాన్ని రాజకీయంగానే ఎదుర్కోవాల న్నారు.రాజ్యాంగం జోలికొస్తే రాజకీయ పతనం తప్పదని కెసిఆర్ కు హెచ్చరించడానికి జిల్లా నుండి అన్ని వర్గాల ప్రజలు వేలాదిగా తరలి రావాలని థామస్ పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో నాయకులు లింగంపల్లి వెంకన్న.అక్కనపల్లి రాజేశం.లింగంపల్లి.హనుమయ్య.గుడిసె నరసయ్య.లింగంపల్లి అంజయ్య.మదన్.రాజేష్.రజినీకాంత్.అశోక్.అజయ్.ప్రభాకర్. తదితరులు పాల్గొన్నారు,

# టీఎస్ఆర్ జేసీ-సెట్ దరఖాస్తుకు గడువు పొడిగింపు

హైదరాబాద్, ఏప్రిల్ 11: తెలంగాణ రాష్ట్ర గురుకుల(రెసిడెన్షియల్) జూనియర్ కాలేజీలలో 2022-23 విద్యాసంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరము( ఇంగ్లీష్ మీడియంలో ఎంపిసి, బిపిసి, ఎంఈసీ)లో 35 తెలంగాణ గురుకుల జూనియర్ కాలేజీల్లో ప్రవేశం కొరకు మే 22వ తేదీన నిర్వహించే టీఎస్ఆర్ జేసీ-సెట్ 2022-23 ప్రవేశ పరీక్షకు మే 2022 ఎగ్జామ్స్ కు హాజరవుతున్న 10వ తరగతి విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

కాగా ఇప్పటి వరకూ ఏప్రిల్ 11వ తేదీ వరకు గడువు విధించారు. కానీ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కోరిక మేరకు దరఖాస్తు గడువును తేదీ ఏప్రిల్,30వ తేదీ వరకు పొడిగించినట్టు తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. 2021-22 సంవత్సరంలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

# రుద్రవరంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 11:(నేటినిజం ప్రతినిధి): అణగారిన కులాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతి రావు పూలే జయంతి వేడుకలను వేములవాడ మండలం రుద్ర వరం గ్రామంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

అనంతరం స్థానిక సర్పంచ్ ఉరిడి రాంరెడ్డి మాట్లాడుతూ సామాజిక అసమానతల మీద అలుపెరుగని పోరాటం చేసి,అణగారిన వర్గాల దళితులు, స్త్రీలు, ఇతర బలహీన వర్గాల విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త,కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాటం చేసిన సామాజిక తత్వవేత్త మహాత్మా జ్యోతిరావు అని అన్నారు.ఈ కార్యక్రమాన్ని కిముఖ్య అతిథులుగా ఎంపీపీ బుర్ర వజ్రమ్మ బాబు ,జడ్పీటీసీ మ్యాకల రవి ,ఎంపీటీసీ గాలిపెల్లి సువర్ణ స్వామిగౌడ్,వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఊరి డిప్రవీణ్, వార్డు సభ్యులు నడిగొట్ల హరికృష్ణ, పావని కనకయ్య , పీఏ సీఎస్ డైరెక్టర్లు కట్టఎల్లయ్య , కత్తి కనకయ్య , మెడికల్ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీకి 160 సీట్లు వస్తాయి: అచ్చెన్నాయుడు

అమరావతి, ఏప్రిల్ 11: బీసీ నాయకులను తయారుచేసే కర్మాగారం టీడీపీ అని ఆ పార్టీ ఏపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మూడేళ్లలో బలహీనవర్గాలకు ఏం చేశారో సీఎం జగన్ శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీసీలకు ఎవరేం చేశారన్నదానిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని జగన్‌కు సవాల్ విసిరారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా టీడీపీకి 160 సీట్లు వస్తాయని అచ్చెన్నాయుడు ధీమా వ్యక్తం చేశారు.

# చౌడలమ్మ ఉత్సవాలలో కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 11:(నేటినిజం ప్రతినిధి):చందుర్తి మండల కేంద్రంలోని యాదవ కుల బాంధవులు ల దైవమైన చౌడలమ్మ ఉత్సవాలలో వేములవాడ నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆది శ్రీనివాస్ సోమవారం పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని. రైతుల పాడి పంటలు పండాలని భగవంతున్ని ప్రార్థించినట్టు తెలిపారు.ఆ చౌడలమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరి పై ఉండి పాడి పంటలు సమృద్ధిగా పండి ఈ ప్రాంత ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. అదేవిధంగా ప్రతి ఏటా యాదవ కుల బాంధవులు ఇలాగే పండగ జరుపుకొని ఆ అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరుకున్నారు.ఆయన వెంట జెడ్పిటిసి నాగం కుమార్,ఎంపి టి సిలు పులి రేణుక సత్యం,వేల్పుల వనజ దేవస్వామి,కుల సంగం అద్యక్షులు పిల్లి కొమురయ్య,గడ్డం బాబు,చిర్రం మహేష్, నాయకులు ,చిలుక భూమేష్,పోతరాజు రవి,బొజ్జ మల్లేశం, లింగంపెల్లి అశోక్,పొంచేట్టి తిరుపతి, చిర్రం నరేష్,మానుక గణేష్,యాదవ కుల బాంధవులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎక్సైజ్ సూపరింటెండెంట్



కరీంనగర్ , ఏప్రిల్ 11: (నేటినిజం ప్రతినిధి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రాను ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి. శ్రీనివాస్ కలిశారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ గా పదోన్నతిపై వరంగల్ జిల్లా నుండి భూపాలపల్లి, ములుగు జిల్లాకు నియమింపబడిన వి. శ్రీనివాస్ ఈ నెల 4న భూపాలపల్లిలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రాను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. బుధవారం నుండి ప్రారంభం కానున్న పుష్కరాల్లో ఎక్సైజ్ శాఖ సమర్థవంతంగా నిర్వర్తించాలని, అక్రమ మద్య నియంత్రణకై పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కు ఆదేశించారు.

# మహాత్మా జ్యోతిబాపూలే మార్గం యువతకు అనుసరణీయం : సీపీ తరుణ్ జోషీ



వరంగల్, ఏప్రిల్ 11: మహాత్మా జ్యోతిరావు పూలే 195వ జయంతి సందర్భంగా హన్మకొండ, ములుగు క్రాస్ రోడ్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు వరంగల్ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషీ. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహాత్మా జ్యోతిరావు పూలే సత్యశోధన సమాజాన్ని స్థాపించి సమానత్వం కోసం, మహిళలు చదువుకోవాలని ఆరాటపడ్డారనీ, అణగారిన వర్గాల కోసం ఎంతో శ్రమించారనీ అన్నారు. ఆ పోరాటం స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు.

కట్టుబాట్లను వ్యతిరేకించి తన భార్యను చదివించడమే కాకుండా టీచర్‌గా కూడా చేశారన్నారు. అందుకే పూలే, బాబాసాహెబ్ అంబేద్కర్ వంటి మహనీయుల కృషిని నేటికీ గుర్తుంచుకుంటామనీ, అలాంటి వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకుని మంచి చేయాలన్నారు. సమాజంలో సన్మార్గంలో నడుస్తూ ఉత్తమ సమాజ నిర్మాణంలో భాగస్వామ్యులు కావాలనీ యువతకు పిలుపునిచ్చారు. రానున్న పోటీ పరీక్షలకు విద్యార్థులు మంచిగా ప్రిపేర్ అయ్యి ప్రభుత్వ ఉద్యోగాలు పొందాలనీ కోరారు. కార్యక్రమంలో హన్మకొండ ఇన్స్పెక్టర్ వేణుమాధవ్, ఎస్సైలు రాజ్ కుమార్ , సురేష్ తదితరులు పాల్గొన్నారు.


ఆహ్వానము

జివిఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్

శ్రీమతి శైలజామిత్ర రచించిన "ఆధునిక పంచ్ తంత్ర కథలు" ఆవిష్కరణ సభ

ముఖ్యఅతిథి : డా॥ కె.వి. రమణ, ఐ.ఏ.ఎస్. (రి) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు

సభాధ్యక్షులు : ఆచార్య టి. గౌరీశంకర్ పూర్వ రిజిస్ట్రార్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, ప్రముఖ కవి

విశిష్ట అతిథి : శ్రీ చొక్కాపు వెంకటరమణ కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత, అధ్యక్షులు బాల సాహిత్య పరిషత్

గౌరవ అతిథి : శ్రీ బైస దేవదాసు సంపాదకులు నేటి నిజం దిన పత్రిక, సీనియర్ జర్నలిస్ట్

గ్రంథ సమీక్ష : శ్రీమతి సమ్మెట విజయ ప్రముఖ రచయిత్రి, కవయిత్రి

స్వాగతం : శ్రీ పెద్దూరి వెంకటదాసు ప్రముఖ కవి, రచయిత, వ్యాఖ్యాత

రచయిత్రి స్పందన : శ్రీమతి శైలజామిత్ర

సాంస్కృతిక కార్యక్రమం: సంగీత విభావరి

గానం: శ్రీమతి చిల్లా శివపార్వతి, స్థాపకురాలు, శ్రీ శ్యామగాయిత్రి మ్యూజిక్ అకాడమి శిష్యులు

తేది: 25-04-2022, సోమవారం, ఉదయం 10:00 గంటలకు

డా॥ కె.వి. రమణ గారి క్యాంపు కార్యాలయం, నఫీజ్ రెసిడెన్సీ, ఎ.సి. గార్డ్స్, హైదరాబాద్.

లయన్ గుదిబండి వెంకటరెడ్డి చైర్మన్

లయన్ వి.వి. రాఘవరెడ్డి ప్రధాన కార్యదర్శి


Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com